
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025



నేడు జిల్లాస్థాయి ఫెన్సింగ్ సబ్ జూనియర్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ వేదికగా మంగళవారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ సబ్‌జూనియర్ బాలురు, బాలికల చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. 'ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగి.. 14ఏళ్లలోపు క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినవారిని మార్చి 1, 2వ తేదీల్లో కృష్ణా జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఆసక్తిగల క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకోవాల'ని రాజా కోరారు.

ఫిట్‌లెస్

ఈ నెల 16న మందస మండలం బైరిసారంగపురం సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు చెరువులోకి దూసుకుపోయి బోల్తా పడింది. నీటిలో పూర్తిగా మునిగిపోయింది. ఆ సమయంలో బస్సులో ఐదుగురు పిల్లలు ఉన్నారు. సమీపంలో ఉపాధి కూలీలు ఉండడంతో వెనువెంటనే పిల్లలను బయటకు తీశారు. లేదంటే చిన్నారులకు ప్రాణనష్టం తప్పేది కాదు.

● నాలుగేళ్ల కిందట ఎచ్చెర్ల మండలం కొయ్యాం సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి చెరువులో బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఓ విద్యార్థి మృతి చెందగా, ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.

గత ఏడాది ఆగస్టు 3న ఇచ్ఛాపురం పట్టణానికి కూతవేటు దూరంలో ఓ ప్రైవేట్‌స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఖాళీ స్థలంలో బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. పొలాల్లో బోల్తాపడి ఉంటే విద్యార్థుల ప్రాణాలు పోయేవని స్థానికులు చెప్పారు.



- కాలం చెల్లిన స్కూల్ బస్సులే వినియోగం
- డ్రైవర్ల ఎంపికలోనూ నిర్లక్ష్యం
- నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న వైనం
- తనిఖీల ఊసెత్తని యంత్రాంగం



రణస్థలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా ప్రైవేట్ విద్యాసంస్థలు స్కూల్ బస్సుల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. కాలం చెల్లిన బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. అర్హత లేని వారిని డ్రైవర్లగా ఎంపిక చేసి వారి చేతికి బస్సులు అప్పగిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎందరో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 508 ప్రైవేట్ స్కూల్ బస్సులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే స్కూల్

- (మిగతా 6వ పేజీలో..)

తనిఖీలు చేపడతాం

ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాం. డ్రైవర్ల విషయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలి. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపితే మాత్రం కఠిన చర్యలు తప్పవు. అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తాం.

- రంగనాథ్, జిల్లా ఇన్‌చార్జి ఆర్టీవో, శ్రీకాకుళం



సోమవారం ఉదయం రోడ్డుపై రాళ్లపిక్కలు లేకుండా ఊడ్చుతున్న కూలీలు

తారుమార్చేశారు!

- అల్‌ఆంధ్రా రోడ్డును పరిశీలించిన కలెక్టర్, ఆర్‌అండ్‌బీ సీఈ
- ముందే జాగ్రత్త పడిన కాంట్రాక్టర్
- తేలిన రాళ్ల పిక్కలను ఊడ్చేసిన వైనం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి నుంచి పాతపట్నంలోని ఆల్‌ఆంధ్రా రోడ్డు మరమ్మతుల విషయం చర్చనీయాంశంగా మారింది. నాణ్యతాలోపంతో చేపట్టిన ఈ పనుల పరిశీలనకు ఉన్నతాధికారులు సోమవారం వస్తున్నారని తెలుసుకుని కాంట్రాక్టర్ అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రి కూలీలతో పనులు చేయించి ఎక్కడా రాళ్ల పిక్కలు తేలకుండా ఊడ్చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆల్‌ఆంధ్రా రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.39లక్షలు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ నాణ్యతాలోపంతో పనులు చేపట్టారు. దీంతో పనులు చేపట్టిన వారం రోజుల్లోనే తారు ఊడిపోయి.. రాళ్లు తేలాయి. ఈ విషయమై.. ఈ నెల 23న 'వారం రోజుల్లోనే పోయింది' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయినట్టు తెలిసింది. కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నమ్మించి.. అమ్మేసి..

- పలాస-కాశీబుగ్గలో ప్రభుత్వ స్థలాలు కబ్జా
- రియల్ ఎస్టేట్ పేరిట తక్కువకు విక్రయాలు
- ఆశపడి.. కొనుగోలు చేసిన వినియోగదారులు
- అవన్నీ ప్రభుత్వ స్థలాలని బయటపడిన వైనం
- ఆక్రమణల తొలగింపునకు అధికారుల చర్యలు

పలాస, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'అదిగదిగో ఆ చార్మినార్ చూశావా.. అది నాదే. కొంచెం డబ్బులు అవసరమని.. దాన్ని తక్కువ ధరకే అమ్మేస్తున్నా. నువ్వు కొనగలవా?. నీకు వద్దంటే చెప్పు మరొకరు రెడీ ఉన్నారు. ఆ ఆఫర్ అతడికి ఇచ్చేస్తా' అంటూ ఓ సినిమాలో ఒక నటుడు.. మరొకరిని బురిడీ కొట్టించి డబ్బులు లాగేసుకుంటాడు. ఇదే మాదిరి.. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కొంతమంది ప్రబుద్ధులు.. రూ.కోట్లు ధర పలికే ప్రభుత్వ స్థలాలు తమ తాతల నుంచి వారత్వంగా వచ్చిందని నమ్మిస్తూ గత నాలుగేళ్ల నుంచి విక్రయిస్తున్నారు. సెంటు రూ.2 లక్షల చొప్పున ఇస్తామని, లేటు చేస్తే భూముల ధర మరింత పెరిగిపోతాయని హడావుడి చేశారు. అది నిజమా.. కాదా.. అన్నది పరిశీలించకుండానే చౌకగా రావడంతో కొంతమంది రూ.లక్షలు పెట్టి ఆ స్థలాలు కొనుగోలు చేశారు. నిర్మాణాలు చేపడుతున్నారు. తీరా ప్రస్తుతం అధికారులు పరిశీలించి.. ఇవి ప్రభుత్వ స్థలాలే అంటూ.. నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచీ సర్వేనెంబరు 51లో ఉన్న సూదికొండ ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు.

దీంతో రూ.లక్షలు పెట్టి స్థలాలు కొనుగోలుచేసిన వారంతా లబోదిబోమంటున్నారు. విక్రయదారులు మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్టు తప్పుకుంటున్నారు.

● కేంద్ర ప్రభుత్వం పలాసలో కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయగా.. దానికి అవసరమైన స్థలం కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరింది. దీంతో సూదికొండ వద్ద ఉన్న 9.10 ఎకరాల భూమి ఇచ్చేందుకు రెవెన్యూశాఖ ఆమోదం తెలిపింది. అప్పటికే ఆ భూములను కొంతమంది కబ్జా చేసి విక్రయించగా.. 47మంది వరకూ ఇళ్లు నిర్మించుకున్నారు. మరికొంతమంది పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఆ ప్రాంతంలో సర్వే చేసి కబ్జాదారులను గుర్తించి వారికి ముందస్తు నోటీసులు ఇచ్చి నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ నోటీసులను పట్టించుకోకుండా స్థానికంగా ఉన్న కొంతమంది నేతలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల మాటలపై విశ్వాసం ఉంచి వాటిని తొలగించలేదు. ఆదివారం ఉదయం నుంచి రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్లు, సిబ్బంది సహాయంతో ఆక్రమణల స్థలాలకు వెళ్లడంతో అప్పుడు వారికి తెలిసొచ్చింది. తాము కొనుగోలు చేసింది ప్రభుత్వ భూములేనని. దీంతో కాళ్లబేరానికి వచ్చారు. అందులో 22 మంది వరకూ (మిగతా 7వ పేజీలో..)



సూదికొండ వద్ద అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

ఎన్నికల విధులపై అప్రమత్తం

- డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందికి ఆదేశించారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో.. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ విధులపై పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బ్యాలెట్ బాక్సు ఆపరేటింగ్, బ్యాలెట్ పేపర్ల పరిశీలన, పీవో డైరీ నిర్వహణ తదితర ముఖ్యమైన ఘట్టాలని వివరించారు. డీఆర్వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. బ్యాలెట్ బాక్సుల (మిగతా 8వ పేజీలో..)

సౌదీ అరేబియాలో ఎం.మరువాడ వాసి మృతి

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం ఎం.మరువాడకు చెందిన కొవిరి రామారావు(37) సౌదీ అరేబియాలో ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రామారావు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేందుకు నాలుగు నెలల కిందట సౌదీ వెళ్లాడు. ఆదివారం ఉదయం కడుపులో నొప్పి ఉందని అక్కడి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ దాసురాజు, సూరాడ ధనరాజ్, మేరుగు నూకయ్య పరామర్శించి ఓదార్చారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రులు తెలిపారని వారు పేర్కొన్నారు.



రామారావు (ఫైల్)



గొట్టాబ్యారేజీ ఎగువ ప్రాంతంలో 'వంశధార' ఇలా..

అడుగంటిన వంశధార

హిరమండలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వంశధార నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. గత నాలుగు నెలలుగా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేక రోజురోజుకూ ఇన్‌ఫ్లో తగ్గిపోతోంది. ప్రస్తుతం 30క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో వస్తుండగా.. బ్యారేజీ వద్ద 33.50మీటర్లు నీటిమట్టం ఉందని వంశధార అధికారులు తెలిపారు. ఎడమ కాలువ ద్వారా 108 క్యూసెక్కుల నీటిని రబీ పంటలకు విడిచిపెడుతున్నారు. మరో రెండుమీటర్లు నీటిమట్టం తగ్గితే కాలువ ద్వారా నీరు విడిచిపెట్టడం సాధ్యం కాదు. రానున్న శివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థస్నానాల కోసం బ్యారేజీ దిగువకు నీటిని విడిచిపెట్టాల్సి ఉంది. దీంతో నీటినిల్వ డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంటుంది. వేసవిలో తాగునీటి అవసరాలకు నీటిని అందించడం కష్టమేనని అధికారులు భావిస్తున్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం

- 100 మంది కార్మికులతో పారిశుధ్య పనులు
- ముఖలింగేశ్వరుని ఆలయం శోభాయమానం

8లో

ఒడిశా టు మహారాష్ట్ర గంజాయి రవాణా


- 21 కేజీలు స్వాధీనం
- నలుగురి అరెస్ట్, ద్విచక్ర వాహనం సీజ్

8లో

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

- అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

6లో



మహేంద్రగిరులపై వెలసిన శివలింగం

మహేంద్ర గిరులు.. మహాద్భుతం

● పాండవులు నడయాడిన నేల ఇది ● కొండపై ఐదుగురి పేరిట ఆలయాలు
● రేపు మహా శివరాత్రి ● నేటి నుంచే యాత్ర ప్రారంభం

6లో

మహేంద్ర గిరులు మహాద్భుతం



గిరులపై ఇలాంటి కట్టడాలు ఎన్నో..

- పాండవులు నడయాడిన నేల ఇది
- కొండపై ఐదుగురి పేరిట ఆలయాలు
- రేపు మహా శివరాత్రి
- నేటి నుంచే యాత్ర ప్రారంభం

మహేంద్ర గిరులు.. మహాద్భుతం! సంద్రం మట్టానికి 5400 కిలోమీటర్ల ఎత్తున ఉన్న ఈ పర్వతం మీద పంచ ఆలయాలు వెలిసి ఉన్నాయి. పైనుంచి పల్లెలు, పట్టణాలు చిన్నచిన్న బొమ్మరిల్లులా.. రాత్రి వేళ విద్యుద్దీపాల కాంతిలో కంచంలో దీపాలు అమర్చినట్లుగా కనిపిస్తాయి. ఇక సూర్యోదయాన భానుడు ఉదయించడాన్ని తప్పక వీక్షించాల్సిందే. ప్రతిఏటా మూడు రోజుల పాటు ఇక్కడ శివరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. ఇక్కడ జాగరణ చేసేందుకు ఏపీ, ఒడిశాతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు సైతం వస్తారు. మంగళవారం నుంచి గిరిపైకి కాలినడకన యాత్ర మొదలవుతుంది.

హరిపురం/పలాస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓం నమఃశివాయ.. అంటూ భక్తులు పారవశ్యంలో మునిగిపోతారు. తమ కోర్కెలు ఈడేరేందుకు శివాలయాల్లో అభిషేకాలు జరిపిస్తారు. జాగారం చేసి.. విరూపాక్షుడిని మనసారా వేడుకుంటారు. ఆ క్షణం మందస మహేంద్రగిరులు శివపంచాక్షరి జపంతో మార్మోగుతాయి. మహాద్భుతంగా పేరొందిన ఈ గిరులు.. శివరాత్రి వేడుకకు సిద్ధమయ్యాయి. రెండు రోజుల ముందునుంచే యాత్రికులు ఇక్కడకు చేరుకుంటారు.

ఇదీ చరిత్ర

పాండవులు అరణ్యవాసం సమయంలో ఈ గిరిపై కొంత కాలం గడిపారని, ఆరాధన కోసం నిర్మించిన ఆలయాలే ఈ పురాతన నిర్మాణాలని పురాణగాథ. ఈ ఆలయాల్లో శివలింగాల ప్రతిష్ఠించడంతో ఏటా శివరాత్రికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. బారువ సముద్ర తీరం నుంచి 48 కిలోమీటర్లు దూరంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఈ గిరులున్నాయి. బడ్డి గజపతులు, రాయగడ, తుంబకోట, పర్లాఖిముడి, మందస రాజులు ఈ గిరిని స్వాధీనం చేసుకునేందుకు అనేక యుద్ధాలు వారి మధ్య జరిగాయని, దీనివల్ల కొన్ని కట్టడాలు నిరాదరణకు గురై శిథిలమయ్యాయని చెబుతున్నారు. కాలక్రమంలో మందస రాజుల ఆధీనంలోకి వచ్చిన తర్వాత 1935లో ఈ ఆలయాలకు మరమ్మతులు జరిగినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడు ఒడిశా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయాయి.



గిరులపై ఆంజనేయస్వామి విగ్రహం

రమణీయ దృశ్యాలు..

మహేంద్రగిరి నుంచి పరికిస్తే ప్రకృతి రమణీయత అద్భుతం. పల్లెలు, పట్టణాలు చిన్నచిన్న బొమ్మరిల్లులా అనిపిస్తాయి. రాత్రి వేళ విద్యుత్తు దీపాల కాంతిలో దేదీవ్యమానంగా వెలిగే జనవాసాలు.. కంచంలో దీపాలు అమర్చినట్లుగా కనిపిస్తాయి. సూర్యోదయాన ఆకాశం పసుపు రంగుగామారి లిప్తపాటు కాలంలో సూర్యుడు ఎర్రని బంతిలా కడలి గర్భంలోంచి పైకి వచ్చే సుందర దృశ్యాన్ని చూసి తీరాల్సిందే. దీన్ని తిలకించేందుకు చలిగాలులును సైతం లెక్కచేయక యాత్రికులు అత్యంత ఎత్తులోనున్న భీముని ఆలయ శిఖారాగ్ర భాగానికి చేరుకుంటారు.



కొండలపై పరశు రాముడి విగ్రహం

అద్భుత కట్టడాలు..


ధర్మరాజు మందిరం సుమారు 150 అడుగుల ఎత్తు ఉంది. దీనిచుట్టూ సువిశాల ప్రాంతం ఉంటుంది. ఈ గోపురం ఆగ్నేయ దిశకు వాలినట్లు కనిపిస్తుంది. ఆలయానికి కొద్దిదూరాన రాతిబండపై అనేకచోట్ల శివలింగాలు వెలిసి ఉన్నాయి. ఇవి చిన్న కుటీరాల మాదిరి రాతి కట్టడాలతో నిర్మితమై ఉన్నాయి. ధర్మరాజు గుడికి దక్షిణదిశగా సహదేవుని ఆలయం, మరికొద్ది దూరంలో మరో శిథిల గోపురం ఉంది. ఇది కర్ణాలయం అని అక్కడి అర్చకులు చెబుతున్నారు. కీకారణ్యంగా చెట్లమధ్య బీష్మాలయం 30 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడికి 4 కిలోమీటర్ల దూరంలో 100 అడుగుల ఎత్తులో అర్జునాలయం, గిరి శిఖారాగ్ర భాగంలో మరో 50 అడుగుల ఎత్తులో భీముని ఆలయం ఉన్నాయి. దిగువ భాగంలోని వనవాస కాలంలో పాండవులు నిర్మించుకున్న వంటశాల, వినియోగించిన రాతి వస్తువులు కనిపిస్తాయి. ధర్మరాజు ఆలయానికి రెండు కిలోమీటర్లు దూరంలో సభావేదిక దర్శనమిస్తుంది.

యాత్రలకు పత్యేక ఏర్పాట్లు..

ఈనెల 25 మంగళవారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి మహాయాత్రకు ఆర్టీసీ అధికారులు పలాస నుంచి 30వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సాబకోట, సింగుపురం గ్రామాల వద్ద నడకయాత్ర భక్తుల కోసం స్వచ్ఛంద సంస్థలు పలు సౌకర్యాల కల్పిస్తున్నాయి. స్థానిక వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు, 108వాహనాలను సిద్ధం చేస్తున్నట్లు వైద్యాధికారి పూర్ణ రవిచంద్ర తెలిపారు.

ఇలా చేరుకోవాలి

- శ్రీకాకుళం నుంచి జాతీయ రహదారి మీదుగా పలాస చేరుకోవాలి. అక్కడనుంచి మందస మీదుగా సాబకోట వరకు ఆర్టీసీ ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సుల్లో వెళ్లాలి. సుమారు 32 కిలోమీటర్లు కొండలు, వాగులను దాటి కాలిబాటన గిరులను చేరుకోవాలి.
- శ్రీకాకుళం నుంచి ఒడిశా పర్లాకిమిడి, కొయిపూర్ మీదుగా మహేంద్రగిరులను చేరవచ్చు. ఈ రహదారిలో గిరుల వరకు రవాణా సౌకర్యం ఉంది. కొయిపూర్ వరకు బస్సు ప్రయాణం చేసి అక్కడ నుంచి ప్రైవేటు వాహనాల్లో పైకి చేరవచ్చు.
- గొప్పిలి, గండాహతి మీదుగా.. సాబకోట, మాణిక్యపురం మీదుగా వాహనాల్లో వేరువేరుగా.. నేరుగా చేరుకోవచ్చు.



మహేంద్ర గిరుల్లో ప్రకృతి అందాలు

పంట రక్షణకు..

- రైతు వినూత్న ఆలోచన
- పొలంలో మెగా ఫోన్ ఏర్పాటు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అంతర పంటలను అడవి పందులు, ఇతర జంతు వులు, పక్షుల నుంచి కాపాడుకునేందుకు ఆ రైతు వినూత్నంగా ఆలోచించాడు.. పొలంలో రీచార్జి మెగాఫోన్ ఏర్పాటు చేసి దాని నుంచి వచ్చే వివిధ రకాల శబ్దాలతో పంటలను రక్షించుకునేం దుకు చర్యలు తీసుకున్నాడు. గ్రామానికి సమీపంలో బెండికొండ ఉండడంతో నిత్యం అడవి పందులు పంటలను నాశనం చేస్తూంటాయి. వీటి నుంచి పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండడం లేదని రైతులు పేర్కొన్నారు. ఈ సమయంలో సీతాపురం రైతు బమ్మిడి భాస్కరరావు చేపట్టిన ఈ ఆలోచన వల్ల మంచి ఫలితం వస్తోందని వారు పేర్కొన్నారు.



పంట పొలంలో అమర్చిన మెగాఫోన్

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

- అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైపోయిన కస్టమర్లు, ఏజెంట్లకు సత్వర న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను పరిరక్షించాలని కోరారు. రాష్ట్రంలో 19.52 లక్షల మంది నుంచి రూ.3986కోట్లను సేకరించి బోర్డు తిప్పేశారని తెలిపారు. సామాన్యులు, పేదవారు అధికంగా మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాలుగా ఈ విషయమై పోరాటం చేస్తున్నామని తెలిపారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.ఆరేలమ్మ, జిల్లా కార్యదర్శి గిరిబాబు, దుంగ శ్రీను పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు



జేసీని కలిసేందుకు వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు

తప్పుడు రసీదులపై చర్యలు తీసుకోవాలి

- విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇసుక ఓవర్ లోడింగ్, నకిలీ బిల్లులు చేస్తున్న ర్యాంపు యజమానులపై, తప్పుడు రసీదులను వాహనాలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు అసోసియేషన్ సభ్యులు వెంకట రమణ, సురేష్‌కుమార్, కొయ్య శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, గిరి శ్రీకాకుళం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 టైర్ల వాహన పరిమితి 25 టన్నులు కాగా 50 టన్నులు, 14 టైర్లు వాహన పరిమితి 30 టన్నులు కాగా 60 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారని తెలిపారు.

బురద నీటితో ఇక్కట్లు

కొత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనప గ్రామం వద్ద వంశధార నదీ తీరంలో ఏర్పాటు చేసిన మెగా రక్షిత నీటి పథకం ద్వారా సుమారు 16 గ్రామ పంచాయతీలకు తాగునీటి సరఫరా అవుతోంది. అయితే గత కొద్ది రోజులుగా కొళాయిల ద్వారా బురదనీరు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని కొత్తూరు పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడనున్న ఇలా బురదనీరు సరఫరా అవుతుండడంతో వ్యాధులు ప్రబలుతాయేమోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొళాయి ద్వారా వచ్చిన బురద నీరు

ఫిట్‘లెస్’

(ఐదో పేజీ తరువాయి)

బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలి. ఈ ఏడాది రవాణా శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీలను తూతూమంత్రంగా చేశారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు అనధికారికంగా బస్సులు నడుపుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. వాస్తవానికి సురక్షితమైన, కండీషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. 15 ఏళ్ల సర్వీసు దాటిన బస్సులను అస్సలు వినియోగించకూడదు. కానీ కొన్ని పాఠశాలలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

డ్రైవర్ల ఎంపిక కీలకం..

స్కూల్ బస్సుడ్రైవర్ ఎంపిక కూడా చాలా కీలకం. శిక్షణ పొందిన, ఆరోగ్యంగా ఉన్న వారినే డ్రైవర్లుగా ఎంపిక చేయాలి. ముందుగా వారి నుంచి ఫిట్‌నెస్ పొందాలి. కంటిచూపు సక్రమంగా ఉండడంతో పాటు మూర్ఛ వంటి వ్యాధులు లేని వారిని ఎంపిక చేసుకోవాలి. అయితే నిష్ణాతులైన డ్రైవర్లకు అధిక వేతనం ఇవ్వాల్సి వస్తోందని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు వయసు పైబడిన వారిని సైతం డ్రైవర్లగా ఎంపిక చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. కానీ, లైట్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారిని కూడా బస్సుడ్రైవర్లగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో జోగుతున్నట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా డ్రైవర్ల విషయంలో యాజమాన్యాలు కఠినంగా వ్యవహరించాలి. డ్రైవర్‌కు కనీస వేతనం కింద రూ.18 వేలు అందించాలి. కానీ, చాలా పాఠశాలలు రూ.10 నుంచి రూ.12 వేలు మాత్రమే అందిస్తున్నాయి. అందుకే నిబంధనలు పట్టకుండా ఉన్నాయి.

ఇవి తప్పనిసరి..

స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాలి. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేయాలి. బస్సు ముందు, వెనుక భాగాల్లో స్కూల్ బస్సు, ఆన్ స్కూల్ డ్యూటీ అని రాయాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఎమెర్జెన్సీ డోర్ ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలి. కిటికీలకు నెట్ తప్పనిసరిగా ఉంచాలి. తలుపులకు లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. పిల్లల కోసం సహాయకులను నియమించాలి. గంటకు 40 కిలోమీటర్ల వేగానికి మించకుండా స్పీడ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయాలి. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ మెజార్టీ బస్సుల్లో ఇవేవీ అమలవుతున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా వీటిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మాఘ బహుళ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం వేదపండితులు, అర్చకులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆదిత్యుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో స్వామివారిని ఉషా, పద్మిని, చాయ సమేతంగా పుష్పాలకంరణ చేశారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వసతులు లేవు.. ఉపాధ్యాయులు లేరు

● సున్నాడలో అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనం నిర్మాణం ● ఇదీ ఒడియా పాఠశాలల్లో పరిస్థితి

పలాస రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఒడియా పాఠశాలల్లో వసతుల కొరత వేధిస్తోంది. ఉపాధ్యాయులు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో బోధన సక్రమంగా జరగడం లేదు. రాష్ట్రంలో స్వాతంత్ర్యం అనంతరం నుంచి ఒడియా రెండో మాధ్యమంగా కొనసాగుతోంది. కాలక్రమేణా ఇక్కడ చేరేవిద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈనేపథ్యంలో పలాస మండలంలోని రెంటికోట, పలాస ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆరునుంచి పదో తరగ తివరకూ, బ్రాహ్మణతర్లా, తర్లాకోట, మరదరాజపురం,కాశీబుగ్గ మేదరవీధివద్దగల ప్రాథమికపాఠశాలల్లో ఒడియా పూర్తిస్థాయిలో బోధిస్తున్నారు.ఒడియా పాఠశాలల్లో సమస్యలు తిష్ఠవేయడంతో ఇక్కడ తెలుగు మీడియంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పలాస మండలంలోని సున్నాడలో గల ఒడియా ప్రాథమికోన్నత పాఠశాలలలో గదులకొరత వల్ల 6,7 తరగతుల విద్యార్థులు ఒకే గదిలో బోధిస్తున్నారు.పాఠశాలలో తెలుగుతోపాటు ఒడియామీడియం బోధిస్తున్నారు. సున్నాడలో ప్రాథమిక విభాగంలో 16 మంది, ప్రాథమికోన్నత విభాగంలో 19మంది విద్యార్థులు 6,7,8 తరగతి చదువుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా, మరో వలంటీర్ సేవలందిస్తున్నారు. గదులు లేక ప్రాథమిక విద్యార్థులకు వరండాలపై, 6,7,8 తరగతుల్లో 7,8 ఒకేగదిలో బోధిస్తున్నారు. సున్నాడలో 2012 నుంచి భవనం నిర్మాణం నిలిచిపోయింది. ఆ భవనం పూర్తయితే అందుబాటులోకి తీసుకువస్తే విద్యార్థులకు వసతి సమస్య తీరేఅవకాశముంది. పాఠ్యాంశ పుస్తకాలు సకాలంలో అందలేదని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఒడియా ప్రాథమికోన్నత పాఠశాలల్లో వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదం డ్రులు కోరుతున్నారు.



సున్నాడలో అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనం

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యం: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):పోలీసు సిబ్బంది నేత్ర సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 175 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కంచిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని కంచిలి ఎస్ఐ పి. పారినాయుడు కోరారు. సోమవారం కంచిలి ప్రభుత్వోన్నతపాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, డీఆర్పీలు వె.శంకరరావు, ఎస్.గోపి, భాస్కరరావు పాల్గొన్నారు.

తెరవే సభ్యుల పుస్తకాల కొనుగోలు

శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక (తెరవే) సభ్యులు రాసిన పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలు కొనుగోలు చేసేందుకు మంగళగిరిలోని రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీచేసినట్లు తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు పుస్తక రచయితలు వాండ్రంగి కొండలరావు, లలితా రెడ్డి, కూన రంగనాయకులను అభినందించారు.

కాలనీలో స్థలాలు విక్రయిస్తే చర్యలు: తహసీల్దార్



నందికొండ లేఅవుట్‌లో పరిశీలిస్తున్న మధుసూదన్

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన కాలనీలో స్థలాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.మధుసూదన్ హెచ్చ రించారు. సోమవారం సరుబుజ్జిలి పంచాయతీ లబ్ధిదారులకు మంజూరుచేసిన నందికొండ జగనన్న కాలనీ లేఅవుట్ పర్యటించారు. నందికొండ కాలనీలో కొంతమంది లబ్ధిదారులు ఖాళీ స్థలాలు, పునాదులతోపాటు వివిధ దశల ఇళ్ల అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి నిజమైన లబ్ధిదారుడు స్థలంలో లేకపోతే అటువంటి రద్దు చేసి ఇళ్లలేని కొత్త లబ్ధిదారులకు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో విశ్వనాథం, రెవెన్యూ సిబ్బంది వరం పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోండి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్.ప్రసాద్, యూబీ మేనేజర్ లిలెన్త్ మిశ్రా, కార్యదర్శి సురేష్, సంఘాల లీడర్లు సీఎఫ్ఎల్ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వేణుగోపాల్, అప్పలరాజు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్కాస్, ఔట్‌సోర్సింగ్, పారిశుధ్య ఇంజనీరింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామారావు, గురుమూర్తి, పార్థసారధి, కూర్మారావు, గణేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



ఇచ్ఛాపురం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్.వెంకటరావు సోమవారం పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.ఇక్కడ 111మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియో గించుకుంటున్నట్లు తెలిపారు.

● పొందూరు, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి) 24 :పొందూరులోని ఎంపీపీ-2 పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి. సత్యనారాయణ పరిశీలించారు. ఇక్కడ మండలంలో 196 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

పొందూరు వాసి నేత్రదానం



శాంతారాం (ఫైల్)

పొందూరు, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 24: పొందూరుకు చెందిన సంఘసేవకుడు కాళ్లకూరి శాంతారాం నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మరణానంతరం తన నేత్రాలను దానం చేయాలన్న శాంతారాం అభీష్టం మేరకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు.దీంతో రెడ్‌క్రాస్ నేత్ర వైద్యులు, సిబ్బంది శాంతారాం కార్నియాలను సేకరించారు.

మొదటి ప్రాధాన్య ఓటు వేసేలా వివరించండి

● రణస్థలంలో నాయకులతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సమీక్ష



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో ఎన్నికల పరిశీలకుడు, కూటమి నేతలు

రణస్థలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు ఈనెల 27న జరగనున్న పోలింగ్‌లో మొదటిప్రాధాన్యత ఓటువేసేలా ఉపాధ్యాయులకు వివరించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. ఈమేరకు రఘువర్మను గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై రణస్థలంలో ఎంపీ తనకార్యాలయంలో సోమవారం సమీక్షించారు.సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు ఆనెపు రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు లంకశ్యామ్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి భానూజీనాయుడు, సోమినాయుడు, గొర్లె లక్ష్మణరావు పాల్గొన్నారు.

బూరగాంలో భోళాలింగేశ్వర శోభాయాత్ర



శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రథం

కంచిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరగాంలో భోళాలింగేశ్వర స్వామి శోభాయాత్రను గ్రామస్థులు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వేషధారణలు, భాజాభజంత్రీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధుల్లో శివనామ స్మరణతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో శివదీక్షా గురుస్వాములు దాసు, దేవదత్తం, శివస్వాములు పాల్గొన్నారు.

లేఆఫ్ నోటీసు ఉపసంహరించుకోవాలి

రణస్థలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):వరిసాంలోని శ్యాంపిస్టన్-2 పరిశ్రమలో అక్రమ లేఆఫ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శ్యాంపిస్టన్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనరసయ్య, గొర్లె కిరణ్, వెలమల రమణ, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

జగన్‌కు చట్టసభలపై గౌరవం లేదు: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):సమస్యలపై పోరాడాలంటే ఎటువంటి హోదాలు అవసరం లేదని చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే చాలని, కానీ జగన్మోహన్‌రెడ్డి మాత్రం ప్రతిపక్ష నాయకుని హోదా ఉంటేనే సమస్యలపై పోరాడుతారా అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలకు రాకుండా రోడ్లపై సమస్యలపై మాట్లాడడం సరికాదని హితవుపలికారు.ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు.సమావేశాలకు హాజరై సభలోనే సమస్యలపై మాట్లాడాలని, ప్రశ్నించాలని అప్పుడే ప్రజాస్వామ్యంపై ఆయనకు గౌరవం ఉందని ప్రజలు నమ్ముతారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డికి చట్టసభలపై ఎటువంటి గౌరవం లేదని విమర్శించారు.

కొర్లకోట రోడ్డుకు నిధుల మంజూరు: ఎమ్మెల్యే కూన

ఆమదాలవలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లకోట బీటీ రహదారి నుంచి జంబుద్వీపం ముద్దాడపేటను కలుపుతూ లింక్ బీటీ రహదారి నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.మూడు కోట్ల 80 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం ఆయన ఫోన్‌లో తెలిపారు.ఉపాధి హామీ పథకం ద్వారా ఈ రహదారిఅభివృద్ధికి కలెక్టర్ పరిపాలన ఆమోదంతెలియజేశారని పేర్కొన్నారు. నిధులు మంజూరుచేసిన సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఎమ్మెల్యే రవికుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రవికుమార్‌కు కొర్లకోట సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ, నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, కొర్లకోట గ్రామస్థులు కృతజతలు తెలిపారు

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన వర్సిటీ విద్యార్థిని



వర్షితను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున ధర్మశాలలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన అఖిల భారత మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న గుజ్జల వర్షిత సత్తాచాటింది.శ్రీకాకుళంలో డిగ్రీ చదువుతున్న వర్షిత ఈనెల 14 నుంచి నాలుగురోజుల పాటు జరిగిన పోటీల్లో పాల్గొని 64 కిలోల కేటగిరీలో రజత పతకం సాధించింది. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఎస్వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

కరాటేలో ఆమదాలవలస విద్యార్థులు..

ఆమదాలవలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండోవార్డు ఊసవానిపేటకు చెందిన విద్యార్థులు పి.నికేష్‌నాయుడు, బి.హేసాయి జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 23న హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ వెపన్ పోటల్లో జిల్లా నుంచి పలువురు విద్యారులు పాల్గొన్నారు.ఈమేరకు పట్టణంలో చదువుతున్న పి.నికేష్‌నాయుడు బంగారు, బి.హేమసాయి కాంస్యపతకం సాధించారు. నికేష్‌నాయుడును కోచ్ నక్క లక్ష్మణనాయుడుతోపాటు పలువురు అభినందించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

జి.సిగడాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధనతో పాటు ఆరోగ్యకరమైన కూరగాయలు అందించవచ్చని నేచురల్ యూనిట్ ఇన్‌చార్జి శివ, రాజేష్ తెలిపారు. సోమవారం జి.సిగడాంలో సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయల ప్రదర్శన ఏర్పాటుచేశారు.

మహిళలకు ఉపాధే లక్ష్యం: పీడీ

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలో స్వయం సహాయక సంఘాల్లో 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తోందని మెప్మా పీడీ ఎస్వీ రమణ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని పట్టణ బహుళార్థక సామాజిక వనరుల అభివృద్ధి కేంద్రంలో జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం (ఎన్ఏటీఎస్)లో భాగంగా అభ్యర్థుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఎల్.హెచ్ బోర భాస్కరరావు, శ్రీకాకుళం సీఎంవో వెంకటరావు, ఆశాసొసైటీ సిబ్బంది హారిక,దివ్య పాల్గొన్నారు.

28న క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇన్నేసుపేటలో గ్రామ డిఫెన్స్ సంఘం, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 28న 3, 4, 5 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి గరిష్ఠంగా రెండు టీములు, ప్రతిగ్రూపునకు నలుగురు సభ్యులు, ముందుగా స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో ఎంపికైన పది టీములతో మెయిన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కవితా సంకలనంలో రాజారావు కవితకు స్థానం

ఆమదాలవలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కుప్పిలి వెంకట రాజారావు కవితకు కాలిఫోర్నియా నుంచి వెలువడిన అంతర్జాతీయ కవితా సంకలనంలో స్థానం లభించింది. వీక్షణం సంచికలో 150 ఉత్తమ కవితల్లో రాజారావు రచించిన పతన సమాధిపై కవిత ఒకటిగా ఎంపికయ్యింది.అలాగే కళాతపస్వి కె. విశ్వనాథ్ కళాత్మక చిత్రాలపై ఒక గ్రంథం రచిస్తున్నట్లు రాజారావు తెలిపారు.

తేజస్ రైలు పొడిగించండి

కంచిలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాజధాని నుంచి నడిచే తేజస్ రైలు(నెం 22811)ను విశాఖపట్నం వరకు పొడిగించాలని కంచిలి రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు బీవీ యాదవ్ కోరారు. ఈమేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు.అలాగే కంచిలి రైలు నిలయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. రైల్వే శాఖామంత్రికి రామ్మోహన్‌నాయుడు ద్వారా వినతి పత్రం అందజేశామని చెప్పారు.

పీఆర్సీ నియమించండి

గుజరాతీపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యేలోగా పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలని స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. తక్షణమే 12వ పీఆర్సీ నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని పేర్కొన్నారు.

నమ్మించి.. అమ్మేసి

(ఐదో పేజీ తరువాయి)

పేదలు ఉండడంతో వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి స్థలాలు ఇస్తామని అధికారులు భరోసా కల్పించారు. మిగిలిన వారి స్థలాలు యథాతథంగా కూల్చివేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకూ ఈ కూల్చివేతలు జరిగాయి. మొత్తం 9.10 ఎకరాల స్థలాన్ని చదును చేసి అందులో ఉన్న రాళ్లు, గుట్టలు తొలగించారు. తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో కాశీబుగ్గ సీఐ బి.సూర్యనారాయణ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుతో ఆక్రమణలన్నీ నేలమట్టం చేశారు.

● రూ.కోట్ల వ్యాపార లావాదేవీలు

బంగారు బాతుగుడ్డుగా పేరుగాంచిన సూదికొండ భూములను ఆ ప్రాంత నేతలు ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశారు. గత ఐదేళ్లు రూ.10కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు జరిగినట్లు బాధితులే స్వయంగా చెబుతుండడం అధికారులకు విస్మయం కలిగిస్తోంది. రెండు సెంట్లు స్థలం రూ.7 లక్షల వరకూ విక్రయించారు. అధికారులు ఆక్రమణలు తొలగిస్తారని తెలిసి కూడా కొంతమంది రూ.10లక్షలు, రూ.20లక్షలు చొప్పున బ్రోకర్లకు చెల్లించి స్థలాలు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారు. సూదికొండ ఆక్ర మణపై 2021 సంవత్సరం నుంచీ 'ఆంధ్రజ్యోతి' లో తరచూ కథనాలు ప్రచురించినా కొనుగోలుదారులు మేల్కోలేదు. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం మంజూరైన నేపథ్యంలో ఆక్రమణలన్నీ తొలగించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానుండడం శుభసూచికమని, అధికా రుల ఆదేశాల మేరకు వారికి సంబంధిత స్థలాలు అప్పగించనున్నామన్నారు.నిర్వాసితులను గుర్తిం చామని, వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు స్థలాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

గుజరాతీపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. సోమవారం శ్రీకాకుళంలో ఎంఈవోలు, కేజీబీవీ పాఠశాలలు, మోడల్ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఎస్‌వోలతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో వెంకటరమణ, ఎం.వాసుదేవకుమార్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోశాలకు పశువుల అప్పగింత

లావేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బుడుమూరు సంత నుంచి విజయనగరం అక్రమంగా పశువులను తరలిస్తున్న ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 13 ఆవులను రణస్థలంలోని మండలంలో కోష్ట వద్ద గల గోసంరక్షణశాలకు అప్పగించారు. విజయనగరం జిల్లాలోని గుజ్జింగివలసకు చెందిన ముగ్గురుపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా శివకుమార్

శ్రీకాకుళం క్రైం,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా వైవీ శివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీలో 36 ఏళ్లుగా రెవెన్యూ అధికారిగా సేవలందించి గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఇక్కడకు బదిలీపై వచ్చారు.

క్రైం కార్నర్

శ్రీకాకుళంలో యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఓ వ్యక్తి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో కలకలం నెలకొంది. రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు,స్థానికుల కథనం మేరకు.. బలగ శివాలయం సమీపంలో యూనియన్ బ్యాంక్ పక్క టి ఏజెంట్ సందులో ఉంటున్న మజ్జి రమేష్(30)కి ఒడియాలోని రాయగడ సమీపంలోని డుకుం గ్రామానికి చెందిన శశితో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రమేష్ స్క్రాప్ షాపులో పనిచేస్తూ భార్య పిల్లలతో జీవిస్తున్నాడు. భార్య వంట పనులు చేస్తోంది. సోమవారం పిల్లలను స్కూల్‌లో దించి శశి పనికి వెళ్లిపోయింది. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వెళ్లగా రమేష్ తలుపులు తీయలేదు. దీంతో హడ్కో కాలనీలో ఉన్న అత్త విజయమ్మ వద్దకు వెళ్లి తన భర్త ఇంటి తలుపు తీయడం లేదని చెప్పింది. అయితే భోజనం చేసి వెళ్దామని చెప్పడంతో భోజనం తర్వాత ఇంటికి వెళ్లి తలుపులు కొట్టగా రమేష్ తలుపులు తీయలేదు. దీంతో వెనుక నుంచి తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా హాలులో రమేష్ విగతజీవిగా పడి ఉన్నాడు. కాగా రెండో పట్టణ పోలీసులు మృతుడి భార్యను విచారించారు. ఇంటి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టడం,పెరటి తలుపులు తీసి ఉన్న నేపథ్యంలో ఆత్మహత్య కాదని హత్యేనన్న అనుమానాలకు తావిస్తోం దని పోలీసులు చెబుతున్నారు. రమేష్ తల్లి విజయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం వివరాలు సేకరించింది.

ఒడిశా టు మహారాష్ట్ర

- 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నలుగురి అరెస్ట్, ద్విచక్రవాహనం సీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు 21 కేజీల గంజాయి తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో పట్టుబడిన గంజాయి కేసు వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు సీఐ మీసాల చిన్నమనాయుడుతో కలిసి విలేకరులకు వివరించారు. డీఎస్పీ కథనం మేరకు.. ఒడిశాలోని గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి ప్రాంతానికి చెందిన అంటుని బీర తన సహాయకుడు తపన్ బీరతో కలిసి 21 కేజీల 610 గ్రాముల గంజాయిని ఒడిశా నుంచి తరలిస్తున్నాడు. పిల్సా బర్దన్, ఆకాష్ బీరల ద్వారా రైలు మార్గంలో మహారాష్ట్రకు పంపించేందుకు ఏర్పాట్లు చేశాడు. జాతీయ రహ దారిపై కవిటి మండలంలోని ఆర్.బెలగాం ఫ్లైఓవర్ వద్ద పోలీసుల తనిఖీల్లో ఒడిశాలోని గజపతి జిల్లా ఆర్.ఉదయగిరికి చెందిన అంటుని బీర, తపన్‌బీర, ఆకాష్ బీర, గజపతి జిల్లా అడవ పోలీసుఠాణా పరిధిలోగల మండిమీరకు చెందిన పిల్సా బర్దన్ పట్టుబడ్డారు. గంజాయిని మహారాష్ట్రలోని వ్యాపారి అశోక్ హెవాల్ అలియాస్ రాజుకు అప్పగించేందుకు నలుగురు తరలిస్తున్నారు. ఈ మేరకు వీరి అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



కౌసల్య(ఫైల్)

సోంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుషాభద్ర కాలనీలో వివాహిత కౌసల్య రౌళో (30) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య కు పాల్పడింది. బారువ పోలీ సులు, స్థానికుల కథనం మేరకు.. బుషా భద్రకు చెందిన పంచనన్న రౌళో మొదటి భార్య మృతి చెందడంతో ఈదుపురానికి చెందిన కౌసల్య రౌళోను తొమ్మిదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్న నాటి నుంచే కౌసల్యను వేధిస్తుండేవాడు. తరచూ ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో వేధింపు లు తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొంది. కౌసల్య రౌళో సోదరి కున్ని రౌళో ఫిర్యాదుమేరకు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేశారు. పంచనన్న రౌళోను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సవర కొరంజిభద్రలో ఇల్లు దగ్ధం

సోంపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని సుంకిడి పంచాయతీ పరిధిలో గల సవర కొరంజిభద్ర గ్రామానికి చెందిన సవర లక్ష్మి ఇల్లు దగ్ధమయ్యింది. స్థాని కులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. విద్యుదా ఘాతంతో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు, ఆవుల శాల పూర్తిగా కాలిబూడిదయ్యాయి. వీటితో పాటు ఆహార ధాన్యాలు, సర్టిఫికేట్లు, నగదు, బంగారం, విలువైన వస్తువులతోపాటు బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం మేరకు అగ్నిమాపకశాఖాధికారి ఎస్.మోహనరావు సిబ్బంది తో కలసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లో సామగ్రి కాలి పోవడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

బెండిగెడ్డను పరిశీలించిన వంశధార అధికారులు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బెండిగడ్డ వద్ద రక్షణ గోడ నిర్మాణంతో నీరు సముద్రంలో కలువకుండా పంట పొలాలకు తరలించే అవకాశంపై సోమవారం వంశధార డీఈఈ సుధాకర్, ఏఈలు రాజశేఖర్, మీనాక్షి పరిశీలించారు. బెండిగడ్డ నీటిని పంట పొలాలకు తరలిస్తే గల్లి, శివరాంపురం, బెండి, మహాదేవపురం, పెద్దబొడ్డపాడు, సీతాపురం గ్రామాల్లోని 1500 ఎకరాల పంట పొలాలకు సాగునీరదించే అవకాశం ఉందని వంశధార డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు గొనప నిరంజన్ అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు రక్షణగోడ నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు దువ్వాడ అప్పారావు, దాశరధి, బాలకృష్ణ ఉన్నారు.

భవనాలు నిర్మించి వదిలేశారు





రెంటికోట, కేదారిపురంలో ప్రారంభించకుండా ఉన్న ఆర్బీకే, సచివాలయం

పలాసరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో గ్రామస్థాయిలోనే పాలన అందించే దిశలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. సచివాలయాల పరిధిలో వివిధ శాఖల కార్యకలాపాలు నిర్వహించేందుకు గాను భవనాల నిర్మాణం చేపట్టారు. ఎంతో ఆర్భాటంగా ఈ వ్యవస్థను ప్రారంభించినా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఇరుకుగదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల భవనాల నిర్మాణం పూర్తి చేసినా వాటిని వినియోగించలేదు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో సిబ్బంది విధుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సచివాలయాలతో పాటు ఆర్బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మించారు. అయితే వీటిని ప్రారంభించలేదు. పలాస మండలంలో కేదారిపురం, రెంటికోట పంచాయతీల్లో నిర్మించిన భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్బీకేల పేర్లు మార్చాలని ఆదేశించినా ఈ భవనాలపై ఇంకా అలానే ఉన్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలను త్వరితగతిన ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎంపీడీవో వసంత్‌కుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా బిల్లులు పెండింగ్ ఉండడంతో వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. సుమారు రూ.40లక్షలతో రెండేళ్ల కిందట నిర్మించిన భవనం వృథాగా ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న రైతు సేవా కేంద్రం

మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం

- 100 మంది కార్మికులతో పారిశుధ్య పనులు
- ముఖలింగేశ్వరుని ఆలయం శోభాయమానం
- 400 మంది పోలీసులతో బందోబస్తు



విద్యుత్ వెలుగుల మధ్య పార్వతీ పరమేశ్వరుల తిరువీధి

జలుమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆలయంతో పాటు గ్రామంలోని పలు వీధుల్లో విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేయడంతో శోభాయమానంగా ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు 100 మంది పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నట్లు డీఎల్పీవో ఐవీ రమణ తెలిపారు. ఈ మేరకు పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. మహాశివ రాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని వీధు ల్లోనూ శానిటేషన్ పనులు నిరంతరం చేయించనున్నామన్నారు. కొమనాపల్లి నుంచి కరకవలస వరకు రోడ్డు కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో ప్రభాకరరావు తెలిపారు. తాగునీటి సదుపాయం తో పాటు ఎండ తగలకుండా షామియానాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేక దర్శనానికి రూ.20 ధర నిర్ణయించామన్నారు. భక్తులకు దక్షిణ ద్వారం వద్ద ఉచిత ప్రసాదం పులిహోర పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

శ్రీముఖలింగంలో 3 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహణకు డీఎస్పీ పర్యవేక్షణలో ఏడుగురు సీఐలు, 19 మంది ఎస్ఐలు, 200 మంది పోలీసులు, 200 మంది హోంగార్డులను ఉన్నతాధికారులు నియమించారన్నారు. ఉత్సవాల చివరిరోజు శుక్రవారం వంశధార నదిలో జరిగే స్వామి వారి చక్రతీర్థ స్నానాలకు అదనంగా 50 రోప్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల పర్యవేక్షణకు 25 సీసీ కెమెరాలను ఆలయం ఎదుట, గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. ద్విచక్ర వాహనాలకు, ఫోర్ వీలర్లు, ఆటోలు, బస్సులకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను కేటాయించామన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు. భక్తులు మంగళ హారతులిచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్పీవో ఐవీ రమణ



శ్రీముఖలింగేశ్వరుని ఆలయంపై విద్యుద్దీపాలంకరణ

న్యూస్ బాక్స్

పరీక్ష కేంద్రంలో సౌకర్యాలుండాలి

మెళియాపుట్టి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ బి.పాపారావు సూచించారు. సోమవారం మెళియాపుట్టి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. విద్యుత్ సదుపాయం, బెంచిలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎంఈవో దేవేంద్రరావు పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిశీలన

నరసన్నపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆసుపత్రిని కాయకల్ప బృంద సభ్యులు సోమవారం పరిశీలించారు. ఆసుపత్రిలో డ్రైనేజ్ వ్యవస్థ, అంతర్గత రోడ్లు, ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించారు. కాయకల్ప బృందం డా. రవికుమార్ ఆధ్వర్యంలో ఇద్దరు సభ్యులు ఆసుపత్రిలో వైద్యసేవలు, శస్త్రచికిత్సలు తదితర సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సీపాన శ్రీనివాసబాబు, అడ్మినిస్ట్రేటివ్ సూపరింటెండెంట్ ఏవీబీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

రథం తయారీకి వితరణ

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటలోని పురాతన జగన్నాథ స్వామి ఆలయానికి సంబంధించిన రథ తయారీకి గాను జనసేన నాయకులు కొరికాన భవాని, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ దంపతులు సోమవారం రూ.6 లక్షల విలువైన సామగ్రిని వితరణగా అందించారు. వీటిని ఆ పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కె.రామశంకర్, పి.రామారావు చేతుల మీదుగా గ్రామస్థులకు అందజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నరసన్నపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 200 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

మిస్సింగ్ సిటిజన్ సర్వే వేగవంతం చేయండి

పలాస, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ పరిధిలో మిస్సింగ్ సిటిజన్ సర్వే సకాలంలో పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు విద్యుత్ సిబ్బందికి ఆదేశించారు. సోమ వారం కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మిస్సింగ్ సర్వే జరుగుతెందని, సకాలంలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఎంపీడీవో వసంతరావు, పాల్గొన్నారు.

ఎనిమిది 'పల్లెపండుగ' పనులు పూర్తి

పోలాకి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చేపట్టిన పల్లెపండుగ పనుల్లో ఎనిమిది పనులు పూర్తయ్యాయని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..పలు గ్రామాల్లో 33 పనులు గుర్తించి 8 పనులు పూర్తిచేశారన్నారు. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మార్చి చివరి నాటికి మిగిలిన పనులు పూర్తి చేయిస్తామన్నారు. కమ్మరివానిపేట, చింతువానిపేట, దీర్ఘాశి, గొల్లలవలస, వనితమండలం, ఈదులవలస, రహిమాన్‌పురం, తలసముద్రం గ్రామాల్లో చేపట్టిన పల్లెపండుగ పనులు పూర్తయ్యాయని వివరించారు.

నేటినుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

పోలాకి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మబగాం, పోలాకి, కోడూరు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్, సూపరింటెండెంట్ బలగప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, అప్‌డేషన్ వంటి కార్యక్రమాలు సచివాలయ సిబ్బంది చేపడతారన్నారు. పోలాకి జడ్పీ బాలికోన్నత పాఠశాల, విశ్వశాంతి ఉన్నత పాఠశాల, నర్సాపురం, మబగాం, కోడూరు ఉన్నత పాఠశాలల్లో ఈ కేంద్రాలు మంగళ, బుధ, గురువారాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు. ఆధార్ అప్‌డేషన్ కాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన ఇంటర్ పరీక్ష పత్రాలు

నరసన్నపేట/పాతపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి జరగ నున్న నేపథ్యంలో ప్రశ్న పత్రాలు సోమవారం నరసన్నపేట, పాతపట్నం పోలీసుస్టేషన్‌లో భద్రపరిచారు. నరసననపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పద్మావతి, జ్ఞానజ్యోతి, సంపత్‌సాయి, శాంతా జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. కార్యక్రమంలో కస్టోడియన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు లే అవుట్లు వేయాలి



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

నరసన్నపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు లేఅవుట్‌లను వేయాలని తహసీల్దార్ టి.సత్యనారాయణ సూచించారు. సోమవారం జమ్ము పంచాయతీల్లో వేసిన పలు లే అవుట్‌లను పరిశీలించారు. వ్యవసాయ భూములకు నాలా చెల్లించాలని, లే అవుట్ నిబంధనలు మేరకు రిజర్వు స్థలం కేటాయించాలన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాక్రమంలో సర్వేయర్ ఎస్.అప్పలస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు నీలమణిదుర్గ ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నందిగాంలోని నీలమణి దుర్గ (పాతపట్నం అమ్మతల్లి) ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ స్థుల ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్ శర్మ పర్యవేక్షణలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

బిల్లులు చెల్లించకుంటే పనులు చేపట్టలేం



గోశాలల లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

నందిగాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గోశాలలకు సంబంధించి చేసిన పనుల మేరకు బిల్లు లు చెల్లించాలని, లేకుంటే మిగిలిన పనులు చేపట్టలేమని పలువురు లబ్ధిదారులు స్పష్టం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 42 గోశాలల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో టి.రాజారావు మాట్లాడుతూ పెండింగ్ పనులు చేయాలని, సకాలంలో బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పశుసంవర్థక శాఖ ఏడీ ఎం.రవికృష్ణ, ఉపాధి ఏపీవో ఎం.నాగరాజు, పశు వైద్యాధికారి జి.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం

పలాస, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ కార్యకర్త బూర్లె ఢిల్లేశ్వరరావుకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని పలాస టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి సోమవారం అందజేశారు. ఢిల్లేశ్వరరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కిష్టుపురానికి చెందిన శ్రీశయన సాధికారిత సభ్యుడు బూర్లె కృష్ణంరాజు ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్నచౌదరి దృష్టికి తీసుకువెళ్లారు. మానవతాదృక్పథంతో తలగాన వాసు ఈ సాయం చేశారు.

'తారు'మార్చేశారు!

(ఐదో పేజీ తరువాయి)

స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డిని వేర్వేరుగా నివేదిక కోరినట్టు సమాచారం. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ కొంతమంది అధికారులను పంపించి.. ఆ రోడ్డును పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నేరుగా ఆయనే ఈ రహదారి పనులను పరిశీలించారు. అనుమానం వచ్చిన దగ్గర రోడ్డును తవ్వి.. తారు నాణ్యతను గమనించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు ఎలా చేశారని, కాంట్రాక్టర్ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేడని చెప్పడంతో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను జైలులో వేయాలని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బ్రిటీష్ కాలం నాటి రహదారి అని.. పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి వసంత్.. కలెక్టర్‌కు విన్నవించారు. దీనిని డబుల్ రోడ్డు చేసేందుకు ఎంత నిధులు అవసరమవుతాయో అంచనాలు రూపొందించాలని ఇంజనీర్ సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. పూర్తిస్థాయిలో పనులు చేపడతామని తెలిపారు. మరోవైపు పాతపట్నంలో ఆర్‌అండ్ బీసీఈ ఎల్.శ్రీనివాసరెడ్డి కూడా మహేంద్ర డిగ్రీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, ఈఈ నాయక్, ఏఈలు యోగి, నాయుడు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా పాల్గొన్నారు.

ఉదయానికే ఊడ్చేశారు

సోమవారం ఉదయం కలెక్టర్, ఆర్‌అండ్‌బీ సీఈ రహదారి పనుల పరిశీలనకు వస్తున్నారని తెలుసుకుని.. కాంట్రాక్టర్ కొంతమంది కూలీలతో ఆదివారం రాత్రంతా రోడ్డుపై తేలిన చిప్స్ రాయిని తొలగించారు. ఆదివారం నాటికి రాళ్లు తేలి ఉండగా.. సోమవారం ఉదయానికి ఒక్క రాయి పిక్క కూడా లేకుండా ఊడ్చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఎన్నికల విధులపై అప్రమత్తం

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. చెక్‌లిస్టును జాగ్రత్తగా పరిశీలించి పోలింగ్ మెటీరియల్ తీసుకోవాలి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3416 మంది, మహిళలు 1619 మంది. ఎన్నికల కమి షన్ ఆదేశాల మేరకు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలి' అని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ అధికారులు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, జి.వెంకటేష్, ఉప కలెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

'వంశధార' నీటిని ఇచ్ఛాపురానికి తరలించాలి

హరిపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వంధార నదీ జలాలను పలాస, మందస, సోంపేట, కంచిలి మీదుగా ఇచ్ఛాపురం వరకు తరలించాలని రైతు సంఘం నాయకులు కోరారు. హరిపురం మార్పు ట్రస్ట్ భవనంలో సోమవారం హేమారావు చౌదరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తామాడ త్రిలోచనరావుతో పాటు పలువురు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని వంశధారను మహేంద్ర, బాహుదా నదులతో అనుసంధానం చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారి రైతులు వలసలకు వెళ్లకుం డా ఉంటారన్నారు. 76 ఏళ్ల నుంచి వంశధార కాలువ పొడిగింపునకు పోరాటాలు చేస్తున్నా నేటికీ నెరవేరలేదని వాపోయారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సింహాద్రి, ఉమామహేశ్వరరావు, కొమర వాసు, గుంటు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

జయమ్మ ఆశయాలను కొనసాగించాలి

పలాసరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేసిన జయమ్మ ఆశయాలను కొనసాగించాలని వక్తలు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో సోమవారం జయమ్మ 5వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ.. ఉద్దానం ఉద్యమాల్లో దిక్సూచిగా నిలిచి ఆదివాసీల ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతరం పోరాటం చేశారని, ఆమె పోరాటంలో చూపిన తెగువ మరువలేనిదన్నారు. అనారోగ్యం వెంటాడుతున్నా సోంపేట, కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. కార్యక్ర మంలో ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమ, కుత్తుమ వినోద్, కృష్ణవేణి, హేమక్క, జానకమ్మ, నాగమణి, రామారావు, గొరకల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సిద్ధం

నందిగాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలకు సిబ్బంది సమాయత్తం అవుతున్నారు. 2023-24 లో 37 పంచాయతీల పరిధిలో వేతనదారులు చేపట్టిన పనులతో పాటు మెటీరియల్ పనులు సచి వాలయాలు, ఆర్బీకేలు, సీసీ రోడ్లు తదితర పనులపై ఈ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు, ఎస్సార్పీ ఎం.తిరుపతిరావు, ఏపీవో ఎం.నాగరాజు తెలిపారు. 37 పంచాయతీల్లో రూ.22.80 కోట్లతో చేపట్టిన పనులను ఏడుగురు డీఆర్పీలతో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. రికార్డులను ఫీల్డ్ అసిస్టెంట్లు, తనిఖీ బృందాలు పరిశీలించాయి.